సమాధానం చెప్పాలి..!

- ఆర్థిక మంత్రి బుగ్గనను నిలదీసిన అంగన్వాడీలు
- సమాధానం చెప్పకుండా నిష్క్రమణ

ప్రజాశక్తి-పత్తికొండ

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి రాజేంద్రనాథ్ రెడ్డిని బుధవారం పత్తికొండ పట్టణంలో అంగన్వాడీ టీచర్లు ఆయాలు నిలదీశారు. పత్తికొండలోని గోపాల ప్లాజా ఫంక్షన్ హాల్ లో పత్తికొండ నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన పాల్గొన్నారు. అంగన్‌వాడీలు దీక్షలు చేస్తున్న ప్రదేశం నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు అంగన్‌వాడీలు ప్రదర్శనగా వెళ్లి ఆర్థిక మంత్రి తినతిపత్రం ఇచ్చారు. ఆర్థిక శాఖ మంత్రికి అంగన్‌వాడీలకు మధ్యవాగ్యాదం జరిగింది. మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు నిధులు కేటాయించడంలో అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించడంలో రాష్ట్రం ఆరోస్థానంలో ఉందని, అయినా ఆందోళన చేస్తే ఎలా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ నాయకులు మాట్లాడుతూ తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని ముఖ్యమంత్రి ప్రజాసంకల్పయాత్రలో అంగన్‌వాడీలకు హామీలు నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అంగన్‌వాడీల ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పలేక పోలీసుల సహకారంతో కారెక్కి అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శోభ, పద్మజ, కాంతమ్మ, రామలక్ష్మి, రమాదేవి, సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, సిఐటియు జిల్లా నాయకుడు వెంకటేశ్వర రెడ్డి, మండల కార్యదర్శి గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సురేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పత్తికొండలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనను నిలదీస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల వంటావార్పు

- 9వ రోజు కొనసాగిన సమ్మె
- సిఐటియు, ఎఐటియుసి మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అంగన్వాడీ కార్మికుల సమ్మె 9వ రోజు ధర్నా చౌక్ వద్ద వంటావార్పు కార్యక్రమం చేసి నిరసన తెలిపారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు రాష్ట్ర శ్రామిక మహిళ నాయకులు పి. నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకష్ణ, ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు అడ్వకేట్ రవికుమార్, ఈ తాండ్రపాడు సిపిఎం సర్పంచు ఎస్. బాలపీరా, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు మనోహర్ మాణిక్యం, జిల్లా కార్యదర్శిమునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతకన్నా, కాంగ్రెస్ నాయకులు శేఖర్, మమ్మద్ వలి, ఎస్‌డిఎఫ్ నాయకులు, సిఐటియు ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కే.ప్రభాకర్ లు సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం భుజం భుజం కలిపి పోరాటం లోకి వస్తామన్నారు. అంగన్వాడీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. అంగన్వాడీల పోరాటం మొక్కవోని ధైర్యంతో ఎన్ని బెదిరింపులు వచ్చినా, ఎన్ని ఆటంకాలు వచ్చినా వాటిని ఎదుర్కొని ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటం కొనసాగించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, సిఐటియు చిన్న వ్యాపార సంఘం నగర కార్యదర్శి ఎస్ఎండి రఫీ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ బాష, సిఐటియు అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రేణుకమ్మ, బాలదుర్గమ్మ, సౌభాగ్యమ్మ, ఎఐటియుసి, నాయకులు జిల్లా నాయకులు రుక్మిణి, చౌడేశ్వరి, సరస్వతి, పాల్గొన్నారు.

కోడుమూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు సిఐటియు నాయకులు గఫూర్‌మియా, జిపివీరన్న సహకారంతో కోడుమూరులోని రెండవ సచివాలయాన్ని ముట్టడించి తాళం వేశారు. అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు విజయభారతి, సూలమ్మ , హైమావతి,అరుణ, రజియా, ఫాతిమా, భాగ్యమ్మ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి సచివాలయం దగ్గర ఆందోళన చేశారు.

గూడూరు : గూడూరులో బస్టాండ్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్మికులు ఒంటి కాలిపై నిలబడి వినూత్నంగా రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈరోజు సమ్మెలో ఉన్న అంగన్వాడి కార్మికులకు వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటప్ప, మండల నాయకులు షఫీరాబి, ఎస్.ఎఫ్.ఐ.జిల్లా సహాయ కార్యదర్శి సాయి, జిల్లా నాయకులు వలి,లు సమ్మెలో కూర్చున్న అంగన్వాడీలకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

కర్నూలులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, వేదికపై పి.నిర్మల, తదితరులు

రేషన్ బండికి జిపిఎస్

- ఏర్పాటుకు పౌరసరఫరాల శాఖ చర్యలు
- రేషన్ పంపిణీపై నిఘా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రేషన్ బండికి జిపిఎస్ పరికరాన్ని అమర్చేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. రేషన్ పంపిణీపై నిఘా పెంచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ చర్యల తరువాత ఏ మేరకు సక్రమంగా సరుకులు అందుతాయో లేదో వేచి చూడాల్సిందే...

ఇంటి వద్దకే రేషన్ సరకులు అందించటానికి ఎండీయూ వాహనాలు తీసుకొచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. గతంలో ప్రతి నెలా ఒకటో తేదీన చౌక దుకాణాల్లో సరకుల పంపిణీ ప్రారంభమయ్యేది. నెల మొత్తం కొనసాగేది. కూలి పనులు చేసుకునే వారు, ఏదైనా అవసరంపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు నెలలో ఏదో ఒకరోజు సరకులు తీసుకెళ్లే వారు. ఎండీయూ వాహనం వచ్చిన రోజు ఇంటి వద్ద లేకుంటే ఇక ఆ నెలలో సరకులు ఇవ్వడం లేదు. దీనిపై కార్డుదారులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేన్ వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రేషన్ వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను ఆమ సంధానించి ఏమేరకు తిరుగుతున్నాయి. కార్డుదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందో పర్యవేక్షించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఒక్కో వాహనానికి రూ.10 వేలు ఖర్చు చేసి జిపిఎస్ పరికరాలను అమర్చాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 706 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. కర్నూలు డివిజన్లో 150, ఆదోని 163, పత్తికొండ 87, నంద్యాల 155, డోన్ 56, ఆత్మకూరు డివిజన్లో 100 వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. ఈ వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.80 లక్షలు వ్యయం అవుతుందని ప్రాథమికంగా పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. వచ్చే నెల నుంచి ఎండియు వాహనాలకు జిపిఎస్ విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారు. తెల్ల, అంత్యోదయ కార్డులు కలిపి కర్నూలు జిల్లాలో 6,62011, నంద్యాలలో 5,33,429 కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాకు 8,548.30, కర్నూలుకు 11,504 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపులు చేస్తున్నారు. ఎండియూ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత కోటాలో మిగులు క్రమంగా పెరుగుతోంది. గతంలో 88 శాతం వరకు పంపిణీ ఉండేది. ఇది క్రమేనా తగ్గుతూ ప్రస్తుతం 80 శాతానికి పడిపోయింది. అక్టోబరు, నవంబరు నెలల్లో 80 శాతం పంపిణీ జరిగింది. ఎండియూ, వాహనాలు నెలకు ఒక్కరోజే వీధిలోకి వస్తున్నాయి. ఆ రోజు తీసుకోకపోతే వారి కోటా మిగిలిపోయినట్లే. ఎండియూ వాహనాలకు జీపీఎస్ పరికరాలు ఆమర్చితే వాటి ద్వారా నెలలో ఎన్ని రోజులు.. ఏయే ప్రాంతాల్లో సరకుల పంపిణీ చేస్తున్నారు? ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేందుకు అవకాశం లేని ప్రాంతాల వివరాలు తెలపాలని పౌర సరఫరాల అధికారి కార్యాలయాలకు ఉత్తర్వులు వచ్చాయి.

మందులపై జిఎస్‌టిని ఎత్తేయాలి

- మెడికల్ రెప్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజలకు నిత్యవసరం వస్తువులుగా మారిన మందులపై జీరో పర్సెంట్ జిఎస్టి విధించాలని ఎపి మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టివిఎస్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎపి మెడికల్ రెప్స్ యూనియన్ (సిఐటియు) ఒక్కరోజు సమ్మెలో భాగంగా జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టివిఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 1976 లో ఏర్పడ్డ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాలు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. మందులు , మందుల పరికరాలపై జీరో పర్సెంట్ జిఎస్‌టిని విధించాలన్నారు. నకిలీ నాశిరకం అరికట్టాలని, ప్రభుత్వ మందుల కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 1976 సేల్స్ ప్రమోషన్ చట్టాన్ని ఇప్పటిదాకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. కార్మిక చట్టాలన్నీ కూడా కేంద్ర ప్రభుత్వం నాలుగు చట్టాలుగా ఏర్పరిచి తూట్లు పొడుస్తున్నారన్నారు. రాష్ట్రనాయకులు వెంకట్ మాట్లాడుతూ చట్టబద్ధమైన పని దినాలు రూపొందించాలని, మెడికల్ రేప్స్ వ్యక్తిగత గోప్యతను హరించే జిపిఎస్ పద్ధతిని తీసివేయాలన్నారు. మందుల సేల్స్‌కు పూర్తి బాధ్యత మెడికల్ రిప్రజెంటేటివ్స్ కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఖలీల్, శెక్షావలి , రాఘవేంద్ర శివరంగ, మారుతి, సురేంద్ర పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న మెడికల్ రెప్రజెంటేటివ్స్

సమ్మెలోకి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుండి సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. కర్నూలు మండల పరిషత్తు అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలన్నారు. పిఆర్‌సి ప్రకారం తమకు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌ఎ, పిఎఫ్ ఇఎస్ఐ ఉద్యోగులందరికీ వర్తింపజేయాలన్నారు. అనేకమంది పార్ట్‌టైం ఉద్యోగులను ఫుల్ టైం లోకి మార్చాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ , మెడికల్ లీవ్‌లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించకపోతే చలో విజయవాడ చేపట్టి ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జెఎసి నాయకులు మహ్మద్ రఫీ, నళిని, చంద్రకళ, ప్రసన్న, గాయత్రి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

జగనన్న విదేశీ విద్యా దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న విదేశీ విద్యా దీవెన ఆర్థిక సాయం నిధులను బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, నగర మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సుధాకర్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, డిసిఎంఎస్ ఛైర్మన్ సిహెచ్.శిరోమణి మద్దయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా ఒక విద్యార్థినికి రూ.6.40లక్షలు లబ్ధి, జగనన్న సివిల్ సర్వీసెస్ ద్వారా ప్రిలిమ్స్‌లో ఎంపికైన ముగ్గురు అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున రూ.3లక్షలు ప్రోత్సాహకంగా మొత్తం రూ.9.40లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా చెక్కును జాయింట్ కలెక్టర్ ఎమ్మెల్యేలు మేయర్ అందజేశారు.

ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఇఒలు శ్రీనివాసులు, వనజకుమారి

ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలంలోని 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం నుండి సరఫరా చేసిన 170 ట్యాబ్ లను బుధవారం మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, వనజ కుమారులు ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీ తో విద్యను అందించడానికి ప్రభుత్వం అందించిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన పెంచుకోవాలి

- ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ హేమలత

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

రక్తహీనతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత అన్నారు. బుధవారం ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి పంచలింగాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను (ఉర్దూ) తనిఖీ చేశారు. అనంతరం హేమలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అత్యంత ప్రధాని ఇస్తుందని తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా విద్యార్థులు ఎవరూ కూడా రక్తహీనతతో బాధపడకుండా ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యమని తెలిపారు. ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని, విటమిన్ సి ఉన్న నారింజ బత్తాయి. నిమ్మకాయలు వంటివి తీసుకోవాలని. ఐరన్ పోషణకు అంతరాయం కలిగించే ఆహారాలు టి.కాఫీ పానియాలను నివారించాలని తెలిపారు. ఆకుకూరలు బెల్లం వేరుశనగ సీజనల్ ఫుడ్స్‌తో పాటు ఇంట్లో ఉండిన ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం భోజనం తర్వాత రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వేసే కార్యక్రమం ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు.ఉపాధ్యాయులు షబ్బీర్, జలీల్ ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సిహెచ్‌సిని, ఆర్అండ్‌బి రోడ్డును ప్రారంభించిన ఆర్థికమంత్రి

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలోని రూ.5.77 కోట్ల అంచనాతో నూతనంగా నిర్మించిన 30 పడకల సిహెచ్‌సి భవనాన్ని , రూ.12 కోట్లవ్యయంతో వెల్దుర్తి నుండి రామళ్లకోటకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డును పత్తికొండ నియోజకవర్గం శాసనసభ్యులు కంగాటి శ్రీదేవమ్మ , జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కర్నూలు నగర మేయర్ రామయ్య లతో కలిసి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వెల్దుర్తి పాత బస్టాండులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత పాలకులు డిప్యూటీ సిఎం, రెవెన్యూ మంత్రి ఇలా ఎన్నో హోదాలలో ఉండి ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదని, జగన్మోహన్ రెడ్డి చొరవతో శ్రీదేవమ్మ ఎమ్మెల్యే అయిన నాలుగున్నర సంవత్సరంలోనే ఇచ్చిన ప్రతి హామీలను నెరవేర్చారన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని రహదారులకు సౌకర్యంగా లేని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామని చెరువులకు హంద్రీనీవా నీటితో నీటిని నింపడం పూర్తికావస్తుందన్నారు. వైసిపి రాష్ట్రప్రధాన కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ కుమార్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రవి రెడ్డి ,జడ్‌పిటిసి సుంకన్న, సర్పంచి శైలజ, బోయినపల్లి అశోక్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

30 పడకల సిహెచ్‌సిని ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి

జిల్లాస్థాయి కౌశల్ 2కె23 క్విజ్ పలితాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్థానిక వెంకాయపల్లి లోని రవీంద్ర గ్లోబల్ స్కూల్లో బుధవారం కౌశల్ 2కె23 క్విజ్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు డిఇఒ డాక్టర్ వి. రంగారెడ్డి హాజరయ్యారు. విశిష్ట అతిథిగా రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జివిఎం. మోహన్ కుమార్ హాజరయ్యారు. రవీంద్ర గ్లోబల్ స్కూల్ సిఇఒ జి.వంశీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తి బయటకు రావాలంటే అంటే క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ వంటివి ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మన కర్నూలును ప్రథమ స్థానంలో ఉంచుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. .అనంతరం రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జివిఎంమోహన్ కుమార్ మాట్లాడారు. కర్నూలు మండల ఎంఇఒ వినోద్ కుమార్ , రాష్ట్ర కౌశల్ అకడమిక్ కోఆర్డినేటర్ కుమార్‌బాబు ,జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రంగమ్మ ,రిడ్జ్ స్కూల్ సిఇఒ జి.గోపీనాథ్‌పాల్గొన్నారు. క్విజ్ లో మొత్తం 36 పాఠశాలలు పాల్గొనగా, పోస్టర్ ప్రజెంటేషన్‌కు జనరల్ విభాగంలో 72 మంది, భారతీయ శాస్త్ర సాంకేతిక రంగంలో శాస్త్రవేత్తల సేవలు విభాగంలో 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టి గ్రామీణ రైతాంగాన్ని వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా కర్నూలు మండలం దీన్నెదేవరపాడు గ్రామ సచివాలయం ముందు నిరసన తెలిపారు. కెవి. నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం వేసిన పంటలకు సకాలంలో వర్షాలు కురవక పంటలు చేతికి రాకపోవడంతో గ్రామ వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోయాయన్నారు. సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను ఆదుకోవాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నారని, కరువు సహాయక చర్యలు ఎక్కడ చేపట్టడం లేదని విమర్శించారు. ఎకరాకు రూ.25 నుండి రూ.50 వేల వరకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు నష్టపరిహారం నేరుగా వారికి ఇవ్వాలని, గ్రామీణ వ్యవసాయ కూలీలకు జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఆరు నెలలపాటు 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. స్థానిక నాయకులు బి చెన్నయ్య, నరసింహులు, మస్తాన్, వెంకట్ రాముడు,కార్యకర్తలు పాల్గొన్నారు

కర్నూలు హాస్పిటల్ : ఓర్వకల్ మండలం నన్నూరు లొద్దిపల్లి గ్రామ సచివాలయాల వద్ద ఎపి రైతు సంఘం మండల నాయకులు ఎస్.మధుసూదన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఎపి రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మల్లేష్, మాసుంబాషా మాట్లాడారు.

కోడుమూరు: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువుతో అల్లాడుతున్న రైతులకు ఎకరాకు రూ.50 వేలు తక్షణమే అందించాలని, పంటలన్నీ దెబ్బతిని నష్టపోయిన కౌలు రైతులకు ఉదారంగా పంట నష్టపరిహారం తక్షణమే అందించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పాలకుర్తి సచివాలయంలో అందజేశారు. నాయకులు గఫూర్, వీరన్న మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యంగా రావడం ఫలితంగా పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు కురియకపోగా మండలంలో తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయి.

సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న నారాయణ, తదితరులు

అత్యాచారం కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

నంద్యాల మండలం క్రాంతినగర్‌లో 2017 డిసెంబర్13న ఒక మానసిక వికలాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయి తలారి సంజీవకు న్యాయస్థానం యావజ్జీవ ఖైదు విధించింది. ప్రత్యేక జిల్లా మహిళా న్యాయస్థానం, కర్నూలు ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.భూపాల్ రెడ్డి బుధవారం తీర్పు చెబుతూ ముద్దాయి జీవించినంత కాలం కఠిన కారాగార శిక్ష విధించారు. బాధితురాలు తండ్రి అనారోగ్యంతో మరణించడంతో ఆమె తల్లి కూలి పనులు చేసుకుంటూ తన ఇద్దరూ మానసిక వికలాంగులైన మగపిల్లలు అలాగే మానసిక వికలాంగురాలు ఆమెను పోషిస్తుంది. బాధితురాలు తల్లి కూలి పనులకు వెళ్లిన వెంటనే అభం శుభం తెలియని మాటలురాని మానసిక వికలాంగురాలిని తన ఇంటికి సమీపంలో ఉన్న ముద్దాయి వివాహితుడు తలారి సంజీవ మాటు వేసి తన ఇంట్లో టివి పనిచేయటం లేదని టీవీ రిమోట్ తీసుకొని రావాలని చెప్పాడు. బాధితురాలు తన ఇంట్లోని టివి రిమోట్ తీసుకొని ముద్దాయి ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే ముద్దాయి తన ఇంటి తలుపులువేసి ఆమెను వివస్త్రను చేసి అత్యాచారం చేశాడు. అత్యాచారవిషయం బయట ఎవరికి చెప్పకూడదని సైగలతో ఆమెను బెదిరించాడు. బాధిత మహిళ ముద్దాయి సంజీవ ఇంట్లో నుంచి ఏడ్చుకుంటూ రాగా బాధితురాలు అవ్వ నాగలక్ష్మమ్మ ముద్దాయిని నిలదీయగా అక్కడ నుండి పారిపోయాడు. అదే దినం బాధితురాలు తల్లి నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిసీటు దాఖలు చేశారు. న్యాయస్థానం 11 మంది సాక్షులను ఐదు మాసాలు విచారించిన అనంతరం ముద్దాయిపై నేరం రుజువు కావటంతో ముద్దాయికి యావజ్జీవ కఠినగారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున నరేంద్రనాథ్ రెడ్డి వాదించారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భూసర్వేపై ఆర్‌డిఒతో గుండ్రేవుల రైతుల ఆవేదన

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోని గుండ్రేవులలో ప్రతి రైతుకు భూ సర్వేలో అన్యాయం జరిగిందంటూ ఆర్‌డిఒ హరిప్రసాద్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలాన్ని సందర్శించిన ఆయన తహసీల్దార్ శేషఫణి సూచన మేరకు ఆర్‌డిఒ హరిప్రసాద్, డిఐ సుబ్బారాయుడులు ఆర్ఐ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం లు గుండ్రేవులకు వెళ్లి సర్వేలో అవకతవకలపై విచారణ చేపట్టారు. ఇక్కడే విఆర్ఒ సచివాలయం సర్వేయర్ పొలాల మీదకు వెళ్లి సర్వే చేసినట్లు లేదని అందుకే సుమారు 136 మంది రైతులకు సక్రమంగా న్యాయం జరగలేదని మీడియాలో పేర్కొన్నారు. సత్వరమే రైతులు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపడతామని రైతులకు హామీనిచ్చారు.

98 శాతం హామీలను నెరవేర్చాం

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదోనిలోని 33వ వార్డు ఖాజీపురలో ఎమ్మెల్యే, 15వ వార్డులో కౌడల్ పేటలో ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. ఆదోనిలో మెడికల్ కళాశాల, జగనన్న కాలనీలో దాదాపు 9,090 పట్టాలు ఇచ్చి, వాటిలోకి ఇల్లు కట్టడానికి కార్యక్రమం కూడా చేపట్టడం జరిగిందని తెలిపారు. డిగ్రీ, ఐటి కళాశాల కూడా వచ్చిందన్నారు. పనిచేసే నాయకుని గెలిపించుకుంటే ఆదోని మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ మధుసూదన్, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, ఫయాజ్, వార్డు కౌన్సిలర్ ఇంతియాజ్, హసీనా భాను, వార్డు ఇన్‌ఛార్జీ ఇబ్రహీం, అమౌంట్ టిప్పు, మాబాష, నరసింహులు, ఎమ్ఎమ్‌జి.గౌస్, ఇక్బాల్, తాయన్న, బషీర్, నూర్, సునాగ్, బోడ ఇస్మాయిల్, నాగరాజ్, ఎజాస్, మునీర్, అబ్బాస్, మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, చిన్న ఈరన్న, సీనా, ఆనంద్ పాల్గొన్నారు.

మోడల్ పేపర్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఎంఇఒలు వరప్రసాద్, శోభ రాణి

మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి - కౌతాళం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్న పదో తరగతి మోడల్ పేపర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒలు వరప్రసాద్, శోభ రాణి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్‌ను, కౌతాళం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్, ఎరిగేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, మండల అధ్యక్షులు నల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఓంకార్ మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత తయారు చేయించిన మోడల్ పేపర్లు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సరళమైన భాషలో ఉన్నాయని చెప్పారు. గత పరీక్షల్లో యుటిఎఫ్ మోడల్ పేపర్ నుంచి 50 శాతం ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. సీనియర్ నాయకులు బసప్ప, నారాయణ, సుధాకర్, రంగన్న, లక్ష్మీ కాంత్ రెడ్డి, మంగరాజు, మహేష్, జయన్న, రామాంజనేయులు, మహిళా ఉపాధ్యాయులు పర్వీన్, రాజేశ్వరి, మేరీ, జాయిస్ పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.7 లక్షలు అందజేత

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా రూ.7 లక్షల చెక్కును అందజేశారు. మండలంలోని దిబ్బనదొడ్డి గ్రామానికి చెందిన రైతు బోయ పెద్ద హనుమంతు సెప్టెంబర్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ముఖ్యమంత్రి కార్యాలయం వారితో మాట్లాడి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం మంజూరు చేయించారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో మృతుని భార్య, నామినీ శాంతమ్మకు రూ.7 లక్షల చెక్కును అందజేశారు. వైసిపి మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఎఒ జీరా గణేష్ పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని పల్లెపాడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ కార్యకర్త భీమేష్ మాట్లాడారు. దేశం వ్యవసాయంతో పాటు పశు పోషణలోనూ అభివృద్ధి సాధించాలని తెలిపారు. మనిషి జీవనోపాధులు కూడా పెంచుకోవాలని కోరారు. ప్రస్తుతం బర్రెలు, మేకలలు, ఆవుల్లో రోగ నిరోధక శక్తి తగ్గి, పాల ఉత్పత్తి తగ్గుతోందని తెలిపారు. పచ్చి, ఎండుగడ్డి మాత్రమే కాకుండా మంచి పోషకాలు కలిగిన పశుగ్రాసం, దాణా అందించాలని చెప్పారు. సర్పంచి రాజేంద్ర నాయుడు, వెటర్నరీ అసిస్టెంట్ హైమావతి పాల్గొన్నారు.

శాశ్వత నిర్మాణాలకు ప్రాధాన్యత

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి - రూ.42 కోట్లతో నిర్మించిన నాగలదిన్నె వంతెన ప్రారంభం

- మూడు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు కీలకం - రాకపోకలు నడిచిన 4 నెలలకు ప్రారంభోత్సవం..!

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే ఎర్రకోట, కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - నందవరం

వంతెనలు, రహదారులు, భవన నిర్మాణాల వంటి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పనులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మూడు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు కీలకమైన నాగలదిన్నె వంతెనను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. బుధవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో రూ.42 కోట్లతో నిర్మించిన నాగలదిన్నె హైలెవెల్ వంతెన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడారు. నాగలదిన్నె బ్రిడ్జి పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పట్ల శ్రద్ధ, తపన మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. 2009లో వరదల వల్ల పాత వంతెన కొట్టుకుపోయిన తరుణంలో 2011లో కొత్త వంతెనను నాటి ప్రస్తుత ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మంజూరు చేయించుకున్నారని చెప్పారు. అనేక కారణాల వల్ల బ్రిడ్జి నిర్మాణానికి పదేళ్ల కాలం పట్టినా, పట్టువదలకుండా ఎన్ని అవాంతరాలొచ్చినా అధిగమించి వైసిపి ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. ప్రజలకు ఎంతో అవసరమైన ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే అడగ్గానే అంగీకరించారని గుర్తు చేశారు. త్వరలోనే తుంగభద్ర నదికి అవతల ఉన్న రహదారిని మరింత సామర్థ్యంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పాత వంతెనతో పోల్చితే ఎత్తు, పొడవు, భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా నిర్మించినట్లు చెప్పారు. జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సర్పంచి లక్ష్మి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ నాగరాజు, జడ్‌పిటిసి నిట్టల్ చక్రవర్తి, వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, విరుపాక్షి రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, అతావుల్లా, రాజేష్ శెట్టి, ఈరన్న, శరత్, తిమ్మప్ప పాల్గొన్నారు.

రాకపోకలు సాగిన 4 నెలలకు ప్రారంభోత్సవం

నాగలదిన్నె బ్రిడ్జిపై గత 4 నెలల క్రితమే వాహనాల రాకపోకలు సాగాయి. అధికార పార్టీ నాయకులు మాత్రం ఇప్పుడు నిర్మాణం చేసి, రాకపోకలకు ప్రారంభించినట్లు రిబ్బన్ కట్ చేశారు. టిడిపి హయాంలోనే నదిలో పిల్లర్లు అన్నీ పూర్తయ్యాయని, కేవలం వైసిపి ప్రభుత్వంలో పైన రోడ్డును మాత్రమే వేశారని, నిర్మాణాన్ని మొత్తం తామే పూర్తి చేసినట్లు చెప్పుకుంటున్నారని టిడిపి నాయకులు సోషల్ మీడియాలో విమర్శలు చేశారు.

రైతులకు కరువు పరిహారమివ్వాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

ఈఏడాది మండలంలో అనావృష్టి నెలకొందని, ప్రభుత్వం కరువు ప్రకటించి చేతులు దులుపుకుందని, రైతులకు కరువు పరిహారం, వలసల నివారణకు ఉపాధి పనులు కల్పించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీర శేఖర్ కోరారు. బుధవారం దేవనకొండ, వెలమకూరు, అలారుదిన్నె, తెర్నేకల్లు, పాలకుర్తి, బి సెంటర్, కరివేముల, జిల్లేడుబుడకల, కప్పట్రాళ్ల, మాచాపురం, నెల్లిబండ గ్రామ సచివాలయాల ముందు నిరసన చేపట్టి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, రైతు సంఘం మండల నాయకులు శ్రీరాములు మాట్లాడారు. కరువు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులు వేసిన అన్ని పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8 వారాల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, వలసల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో బాలబాలికల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యకాస నాయకులు బజారి, యూసుఫ్, నాగేష్, పాండు, పరమేష్, కెపి.రాముడు, గాజుల శ్రీనివాసులు, బడేసాబ్, కృష్ణ, రామాంజనేయులు, రామకృష్ణ, మహేష్, హమీద్ పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జనవరి 20న ఎంపిక పరీక్షలు

- బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

2024-25 విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి, జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్షలు జనవరి 20, 2024న నిర్వహిస్తున్నట్లు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నెంబర్, పాస్‌వర్డ్ గాని పుట్టిన తేదీని ఉపయోగించుకొని అభ్యర్థులందరూ https://cbseitms.rcil.gov.in/nvs/AdminCard/AdminCard వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 085212-29454 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

- 9వ రోజూ అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - మంత్రాలయం

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు తెలిపారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 9వ రోజుకు చేరింది. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు అధ్యక్షత వహించారు. అంజిబాబు, సిఐటియు ఎమ్మిగనూరు నాయకులు గోవిందుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీలు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తుంటే, సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనని విమర్శించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కొన్ని ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించే ప్రయత్నం చేస్తున్నారని, అది సరైంది కాదని తెలిపారు. వారి సమస్యలను అర్థం చేసుకొని ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. అంగన్వాడీలకు జీతాలు పెంచితే రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని అంటున్నారని, విశాఖపట్నంలో ముఖ్యమంత్రి గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం రూ.450 కోట్లు ఖర్చు చేస్తున్నారని, అది అవసరమా అని ప్రశ్నించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిఐటియు, ఇతర ప్రజా సంఘాలు వారికి వెన్నంటే ఉంటాయని, పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ మండల నాయకులు ఆంధ్రయ్య, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి విశాలాక్షి, ఉపాధ్యక్షులు భీమేశ్వరి, నాయకులు ఫాతిమా, దాక్షాయని, ఉమామహేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు. **ఆదోని**లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన సమ్మె శిబిరం వద్దకు సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న చేరుకొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, తదితర న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మ, వరలక్ష్మి, జానకి, సిఐటియు నాయకులు గోపాల్, తిప్పన, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ వీరేష్, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి వెంకన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాబీర్ బాష, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి కొత్తూరు గంగన్న, బసాపురం వీరన్న, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఈరన్న, ఎఐవైఎఫ్ నాయకులు రమేష్, అంజిత్, మల్లికార్జున, వెంకప్ప, మణి పాల్గొన్నారు. **కోసిగి** ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఒంటి కాలిపై నిలబడి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దండాలు పెడుతూ నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతుసంఘం మండల కార్యదర్శి వీరేష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు హెబ్సిబా రాణి, లూసమ్మ, వరలక్ష్మి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. వేతనంలో సగం పించను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి, పద్మావతి, సుజాత, తిక్కమ్మ, సరిత, రాణి, మల్లేశ్వరి, నాగరత్నమ్మ, నాగమణి, పెద్దక్క, మదమ్మ, భీమలింగమ్మ, దేవి, జహీరా బేగం పాల్గొన్నారు. **ఆలూరు**లో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు వేపాకుతో అమ్మవారు పూనకం వచ్చినట్లు నిరసన చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు జయశ్రీ, బాల రంగమ్మ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి మాట్లాడారు. అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాశీం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవరాజు, రూపలత, సీనియర్ ఉపాధ్యాయులు మంజుల మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు షాకీర్, కృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లీలావతమ్మ, సరోజమ్మ, లక్ష్మి, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో ర్యాలీ నిర్వహించి, 550 మందితో సోమప్ప సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. సమ్మెకు జనసేన సీనియర్ నాయకులు చల్లా వరుణ్, తాలూకా నాయకులు మున్నా, నవీన్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కాశీం నాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రంగప్ప, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయ్, రాము, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు సాల్మన్ రాజు, కె.ఇస్మాయిల్, అల్లాబకాష్, యు.లక్ష్మన్న మద్దతు తెలిపారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, అర్బన్ కమిటీ కార్యదర్శులు ఎస్.నాగలక్ష్మి, కృష్ణవేణి, బసమ్మ, గోనెగండ్ల మండల కార్యదర్శి నీరజ, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, ఎఐటియుసి మండల కార్యదర్శి వి.తిమ్మగురుడు, ఐఎఫ్‌టియు కార్యదర్శి ఏసేపు, యూనియన్ నాయకులు శైలజ, మేరీ, మల్లేశ్వరి, నాగేశ్వరమ్మ, లక్ష్మీదేవి, యుఎమ్.నాగలక్ష్మి, జయమ్మ, పద్మలత, గ్రేసమ్మ, పుష్పవతి పాల్గొన్నారు. **ఆస్పరి**లో వంటావార్పుతో నిరసన చేపట్టారు. జనసేన నాయకులు అరవింద్, విశ్వనాథ్, మనోజ్ మద్దతు తెలిపారు. సిపిఎం, సిపిఐ, సిఐటియు, రైతుసంఘం, ఎఐటియుసి మండల కార్యదర్శులు హనుమంతు, బాలకృష్ణ, విరుపాక్షి, రామాంజినేయులు, రంగస్వామి, కృష్ణమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి మాట్లాడారు. అంగన్వాడీ నాయకులు సరోజమ్మ, ప్రమీలమ్మ, విశ్వకుమారి, విజయలక్ష్మి, రాధమ్మ, చిట్టెమ్మ, సంజీవమ్మ, శ్రీదేవి, గీతావాణి, నాగమణి, ఛాయాదేవి పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, సిపిఐ నాయకులు ఆంజనేయ వెళ్లి సంఘీభావం తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో సమ్మె చేపడుతున్న అంగన్వాడీలు

ఆదోనిలో మాట్లాడుతున్న గిడ్డయ్య

కోసిగిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఆలూరులో అమ్మవారి పూనకంతో అంగన్వాడీల నిరసన

ఎమ్మిగనూరులో అంగన్వాడీల మానవహారం

పేదల పక్షపాతి వైసిపి

- మున్సిపల్ ఛైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలిచిందని మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంతమ్మ, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, జెసిఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ, కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆదోనిలోని 29వ వార్డులో 'ఏపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల ఆశీస్సులతో 2024లో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ శాంత

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

లబ్ధి పత్రం అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 21వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడపగడపకు తిరిగి లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లెట్లు అందించారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, వార్డ్ ఇన్‌ఛార్జీ మురారి రాజశేఖర్, కౌన్సిలర్ కామ్మర్తి, నాగేశప్ప పాల్గొన్నారు.

పులికనుమ పంపు హౌస్ పంపింగ్ నిలిపేయాలి : గ్రామస్తులు

ప్రజాశక్తి - కోసిగి

పులికనుమ పంపు హౌస్ పంపింగ్‌ను నిలిపేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సాతనూరు గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర నది తీరాన ఉన్న పులికనుమ ప్రాజెక్ట్ స్టేజ్-1 టిబి డ్యాం ద్వారా వచ్చే నీటిని నిలిపివేయడం ద్వారా, నదిలో నీటి పారుదల లేకపోవడంతో, నిల్వ ఉన్న నీటిని పంపింగ్ చేయడం వల్ల రానున్న రోజుల్లో తాగడానికి ఇబ్బందిగా మారుతుందని తెలిపారు. గత మూడేళ్ల క్రితం నదిలో నీళ్లు ఇంకిపోతే చెలిమిల్లి తోడుకొని నీళ్లు తెచ్చుకుని తాగే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈసారి కూడా అలా జరిగితే చాలా ఇబ్బంది అవుతుందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పులికనుమ ప్రాజెక్ట్ అధికారులను గ్రామస్తులు కోరారు.

కనబడుట లేదు

వి.మౌనిక,
వయస్సు 33 సం॥రాలు,
ఎత్తు : 5 అడుగులు,
కలరు : తెలుపు
ఇంటి నుండి వెళ్లినప్పుడు ఆకుపచ్చ చీర ధరించిఉన్నది.
మతిస్థిమితం లేక నవంబర్ 27వ తేది సోమవారం సా॥ 6 గంటలకు ఇంటి నుండి గుడికివెళ్తాను అనిచెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎవరికైన ఆచూకి తెలిసిన కింది చిరునామాకు తెలుపుగలరు.
వి.మౌనిక
భర్త : వి. వీరేష్ బాబు. ఇంటి నెం. 77-55-3-4, చింతలమునినగర్, కల్లూరు ఎస్టేట్, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.
సెల్ : 7997486371, 9000304253, 9392146107.

నిరవధిక సమ్మెలోకి ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మండల విద్య వనరుల కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా సాయి బేస్, ఎం.లక్ష్మప్ప, కె.పంపాపతి, తుకారాం, రేణుక, రవీంద్రనాథ్, కె.మల్లయ్య మాట్లాడారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా నాలుగున్నర ఏళ్లు పూర్తయినా ఇంతవరకు తమ గురించి చర్చించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఉద్యోగ భద్రత లేక చాలీచాలని జీతంతో, సమయానికి అందక దుర్భరమైన జీవితాలను గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్తూ ఎంఇఒ కార్యాలయంలో నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందవరం

క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయి ప్రారంభించారు బుధవారం నందవరం ఎస్సీ కాలనీ ఎంబి చర్చి వెనుక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువకులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని తెలిపారు. యువత క్రీడల్లో పాల్గొనేందుకు తన వంతు సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటామని చెప్పారు. క్రికెట్‌లో మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు మాధవ దేశాయి అందజేస్తున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. చర్చి పాస్టర్ బిఎస్.ప్రసాద్, ఆర్గనైజర్ రంగప్ప, ఆకాష్, ప్రకాష్, టిడిపి నాయకులు నరసింహులు, చాకలి శీను, దేవపుత్ర, పరంపగు నాగయ్య పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న మాధవరావు దేశాయి

ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, ఎల్లప్ప, నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలని కోరారు. పిఆర్‌సి అరియర్స్, పిఎఫ్ లోన్లు, మెడికల్ బిల్స్, ఎపి జిఎల్ఐ అరియర్స్ మొత్తం రూ.11 కోట్లకు పైగా ప్రభుత్వం బకాయి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి గతంలోనే తీసుకెళ్లగా సెప్టెంబర్‌లోనే చెల్లిస్తామని చెప్పి ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. యుటిఎఫ్ నాయకులు కౌలన్న, అల్లాబకాష్, హనుమంతు, ఆంజనేయ, రాఘవేంద్ర, నాయక్, నాగన్న, విజయ్ కుమార్, మాదన్న, చంద్రపాల్, ప్రసాద్, ప్రకాష్, రాజు, రవి, శివ, భీమేష్, నాగుర్ బాష, నాగేష్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు.. సామాజిక బాధ్యత...

- తహశీల్దార్ చంద్రశేఖర్, విద్యుత్ ఎడిఎ శాంతి స్వరూప్

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పొదుపును సామాజిక బాధ్యతగా భావించాలని తహశీల్దార్ చంద్రశేఖర్, విద్యుత్ ఎడిఎ శాంతి స్వరూప్ తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. 'విద్యుత్ ఆదా'పై రచ్చుమర్రి గ్రామ సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఒ మణిమంజరి, విద్యుత్ ఎడిఇ శాంతి స్వరూప్, ఎఇ గోవిందు విద్యుత్ ఆదాపై పలు సూచనలు చేశారు. రచ్చుమర్రి గ్రామ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఆదోని సబ్ కలెక్టర్‌గా శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని సబ్ కలెక్టర్‌గా శివ నారాయణ శర్మను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోనిలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన అభిషేక్ కుమార్ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ కలెక్టర్ సృజనను కర్నూలులో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ ఏది..?

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణాల్లో పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.నీలకంఠప్ప తెలిపారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడులో కోవిడ్-19 సరికొత్త రకం జెఎన్-1 వైరస్‌ను గుర్తించడంతో ప్రజల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. పట్టణం నుంచి కేరళ, తమిళనాడు ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం, దైవ దర్శనాల కోసం రాకపోకలు ఉండడంతో పట్టణ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపల్ శానిటేషన్ అధికారులు ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనులపై మరింత శ్రద్ధ వహించేలా చూడాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఆస్పత్రుల్లో మందులను సమకూర్చుకోవాలని కోరారు. ఆదోని సబ్ కలెక్టర్, పట్టణ ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించేలా చొరవ చూపాలని తెలిపారు. మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, కాంగ్రెస్ కార్యదర్శి సాయినాథ్, ఆదోని యువజన అధ్యక్షులు దేవి శెట్టి వీరేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప

IN THE COURT OF THE HONBLE IST ADDL JUNIOR CIVIL JUDGE : KURNOOL
O.S.NO.1382/2022
BETWEEN :
వడ్డే అయ్యన్న. ...అర్జీదారు/వాది
వర్సెస్
సి.మధుసూదన్ తండ్రి సి.తిమ్మన్న వయసు 35 సంవత్సరములు, ప్రైవేటు ఉద్యోగము, ఇంటి నెంబర్ 1-35 గుండ్లమల్లాపురం గ్రామం, క్రిష్ణగిరి మండలం, కర్నూలు జిల్లా. ...ప్రతివాది
ప్రతివాదికి నోటీసు/సమన్లు
ఇందుమూలముగా ప్రతివాదికి తెలియ జేయడం ఏమనగా కోర్టు ద్వారా సూట్ సమన్లు ప్రతివాదికి పంపిన అవి ముట్ట లేనందున ఈ పత్రిక ద్వారా సూట్ సమన్లు పంపుచున్నాము. కావున రెస్పాండెంట్ వారు వాది వేసిన ప్రామిసరీ నోటు నుండి రావలసిన బాకీ నిమిత్తము వేసిన కేసు 18/01/2024 ఉదయం 10:30 గంటలకు హాజరై లేదా ప్రతివాది తరుపున వకీలు కూడా తమ ఆక్షేపణలు తెలుపవచ్చునని లేనియెడల కోర్టు వారు పరోక్షముగా విచారించి తీర్మానించబడును అని తెలియజేయుచున్నాము.
కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
వాయిదా తేది 18/01/2024
ఎస్.సి.హెచ్ మాబూసాహెబ్,
వాది పరము అడ్వకేట్, కర్నూలు.

జనం మెచ్చిన పాలన

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో జనం మెచ్చిన పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక ప్రతిభ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో అందిస్తున్న విద్యను, విద్యార్థులు ఎలా అభ్యసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బాలనాగిరెడ్డి సతీమణి జయమ్మ, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, అవతారం, మండల నాయకులు ఏకం రెడ్డి, రామన్న గౌడ్, అనిల్ కుమార్, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, రామన్న, భీమేష్, ఉమాపతి, అబ్దుల్ సమద్, పాల్గొన్నారు.

ప్రతిభ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

OFFICE OF THE ANDHRA PRADESH STATE WAQF TRIBUNAL COURT
3rd & 4th Floor, 'S' Towers, D.No.43-122, 5th Lane, N.R.Peta, Kurnool
ADVT.No.... Dated: 21-12-2023
Recruitment Notice (Vacancy Notice No.100/2023
Applications in the prescribed format are invited from the eligible and experienced candidates for direct recruitment to the following posts:
L.D.Steno - Typist - 1 Post
Office Subordinate - 1 Post
* For details of Education Qualification/Technical Qualification, Age, Eligibility/Application Format etc., kindly visit the Notice Board of the Office (or) contact the staff members of the AP State Waqf Tribunal, Kurnool.
* Last date fir submission of Application in the Office is 19-01-2024.

ప్రజాశక్తి
గురువారం 21 డిసెంబర్ 2023 5 నంద్యాల

బండిఆత్మకూరులో జోలె పట్టి భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

9 రోజులైనా స్పందన కరువు..

- సమ్మెను కొనసాగిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం శీత కన్ను ప్రదర్శిస్తోంది. గత 9 రోజులుగా అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. చర్చల పేరుతో కాలయాపన చేస్తోంది. అంగన్వాడీ కేంద్రాలను తాళాలను పగలగొట్టి సచివాలయ సిబ్బందికి అప్పగించడం దారుణం. అంగన్‌వాడీలకు, సచివాలయ ఉద్యోగులకు మధ్య చిచ్చు పెట్టె ప్రయత్నం చేస్తోంది. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 వరకు అంగన్వాడీ కేంద్రాల్లోఉంటూ గర్భిణీలకు, గర్భతులకు, పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కార్మికులపై ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. నాడు-నేడు పనులు కూడా అంగన్వాడీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతుంది. దీని వలన అంగన్వాడీ లక్ష్యం నెరవేరే అవకాశం ఉండదు. గర్భిణీలకు, గర్భతులకు, పిల్లలకు సరైన సేవలు అందవనే వాదన వినిపిస్తుంది. అంగన్వాడీల సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం చొరవ చూపాలని, తక్షణమే చర్చలు జరిపి అంగన్వాడీ వ్యవస్థను కాపాడాలని, ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ప్రభుత్వానికే నష్టమని అంగన్వాడీలు హెచ్చరిస్తున్నారు.

చాగలమర్రిలో ప్రధాన రహదారిపై సహపంక్తి భోజనం చేస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

6 నెలలుగా కేంద్రాల అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లించలేదు

7 వేలతో నెల రోజులు ఎలా బతకాలి. ప్రభుత్వం మా జీతాలు పెంచమంటే స్పందించడం లేదు. ఆరు నెలలుగా అంగన్వాడీ సెంటర్ల అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించలేదు. అంగన్వాడి సెంటర్లను కమర్షియల్‌గా మార్చడం వల్ల కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి.

మల్లేశ్వరి, ఆయా, ఏకలవ్య నగర్ నూనెపల్లె.

మినీ సెంటర్‌ను మెయిన్‌గా మార్చాలి

ఆదర్శనగర్, బాలాజీ నగర్, మారుతి టౌన్‌షిప్‌లను కలుపుకొని మినీ అంగన్వాడి కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఏరియాలో 2 వేల మంది జనాభా ఉన్నారు. 36 మంది గర్భవతులు, బాలింతలున్నారు. ప్రీ స్కూల్ పిల్లలు 34 మంది, 6 ఏళ్లలోపు పిల్లలు 50 మంది ఉన్నారు. 2 వేలకు పైబడి జనాభా ఉంటే మెయిన్ సెంటర్‌ను పెట్టాలి. గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యేకు విన్నవించినా మార్చలేదు. మినీ సెంటర్‌లో ఓకే టీచర్ ఉండడం వలన పని భారం పెరుగుతోంది. ఇటీవల మూత్రశాలలను కూడా ఫోటో తీసి యాప్‌లో పెట్టాలని అధికారులు చెబుతున్నారు. వేతనాలు మాత్రం నామమాత్రమే.. ఎలా బతికేది..

- తిరుపాలమ్మ టీచర్, మినీ అంగన్వాడీ సెంటర్ ఆదర్శ నగర్ నంద్యాల.

తాళాలు పగలగొడితే ఫలితం ఉండదు

తాళాలు పగలగొట్టి సెంటర్లు తెరిపించడం ద్వారా ఫలితం ఉండదు.. సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వానికి మనుగడ. లేకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదు. కలెక్టర్ అధికారులపై సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి సెంటర్లు తెరిపిస్తున్నారు. ఉద్యోగులు కూడా అయిష్టంగానే సెంటర్లు తెరవడానికి వెళు న్నారు. లబ్ధిదారులు ఎవరూ వెళ్ళటం లేదు. అంగన్వాడీల, ప్రభుత్వ ఉద్యోగుల మధ్య గొడవలు సృష్టించాలని ప్రయత్నిస్తుంది..

సునీత, నంద్యాల ప్రాజెక్ట్ కార్యదర్శి.

సమస్యలను సిఎం పరిష్కరించాలి

తక్షణమే అంగన్వాడీల సమ్మెపై ముఖ్యమంత్రి స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ఆయాలు, టీచర్లు కేంద్రాలను దేవాలయాలుగా భావిస్తూ పిల్లలకు, బాలింతలకు, గర్భవతులకు అనేక రకాల సేవలు అందిస్తున్నారు. అలాంటి వారి పట్ల సిఎం నిర్లక్ష్యంగా ఉండడం తగదు.

- నాగరాణి, జిల్లా సహాయ కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, నంద్యాల.

జోలె పట్టి.. భిక్షాటన చేస్తూ..

- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల నిరసన
- కాంగ్రెస్, టిడిపి, జనసేన, ప్రజా సంఘాల మద్దతు
- చాగలమర్రిలో వంటావార్పు, జూపాడుబంగ్లాలో రాస్తారోకో
- రుద్రవరంలో ఉరితాళ్లు బిగించుకుని నిరసన

నంద్యాల జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె తొమ్మిదో రోజు బుధవారం కొనసాగింది. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆత్మకూరు, చాగలమర్రి, కొలిమి గుండ్ల, కొత్తపల్లి, నంది కొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల మండల కేంద్రాల్లో భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. చాగలమర్రిలో వంటావార్పు చేపట్టారు. మిడు తూరులో టిడిపి, నందికొట్కూరు లో కాంగ్రెస్, జనసేన పార్టీ, చాగల మర్రిలో యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. (వార్త 6వ పేజీలో..)

రుద్రవరంలో ఉరితాళ్లు బిగించుకుని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన

కొలిమిగుండ్లలో తహశీల్దార్ ధోని ఆల్‌ఫ్రెండ్‌ను భిక్షం అడుగుతున్న అంగన్వాడీలు

పేద విద్యార్థులకు బాసటగా ప్రభుత్వం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

- 'జగనన్న విదేశీ విద్యాదీవెవ-జగనన్న సివిల్ సర్వీసెస్' కింద రూ.34.88 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చదవగలిగే ప్రతిభ ఉండి కూడా పేదరికం, ఆర్థిక పరిస్థితుల కారణంగా విదేశాలలో చదువుకోలేని విద్యార్థులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్లను, సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 95 మంది, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, మైనారిటీ సంక్షేమ అధికారులు విద్యార్థులు, విద్యార్థుల తలిదండ్రులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాల క్రింద 2023-24 సంవత్సరానికి 34.88 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద నలుగురు విద్యార్థులకు రూ.33.65 లక్షలు, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద ఒక విద్యార్థికి లక్ష రూపాయలను వారి ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత పదవులను అలంకరించాలని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా చెక్కును అందజేశారు.

మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు తదితరులు

రేషన్ బండికి జిపిఎస్

- ఏర్పాటుకు పౌరసరఫరాల శాఖ చర్యలు

- రేషన్ పంపిణీపై నిఘా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రేషన్ బండికి జిపిఎస్ పరికరాన్ని అమర్చేందుకు పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. రేషన్ పంపిణీపై నిఘా పెంచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆ చర్యల తరువాత ఏ మేరకు సక్రమంగా సరుకులు అందుతాయో లేదో వేచి చూడాల్సిందే...

ఇంటి వద్దకే రేషన్ సరకులు అందించటానికి ఎండీయూ వాహనాలు తీసుకొచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. గతంలో ప్రతి నెలా ఒకటో తేదీన చౌక దుకాణాల్లో సరకుల పంపిణీ ప్రారంభమయ్యేది. నెల మొత్తం కొనసాగేది. కూలి పనులు చేసుకునే వారు, ఏదైనా అవసరంపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు నెలలో ఏదో ఒకరోజు సరకులు తీసుకెళ్లే వారు. ఎండీయూ వాహనం వచ్చిన రోజు ఇంటి వద్ద లేకుంటే ఇక ఆ నెలలో సరకులు ఇవ్వడం లేదు. దీనిపై కార్డుదారులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రేషన్ వాహనాలకు జిపిఎస్ వ్యవస్థను ఆమ సంధానించి ఏమేరకు తిరుగుతున్నాయి. కార్డుదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందో పర్యవేక్షించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఒక్కో వాహనానికి రూ.10 వేలు ఖర్చు చేసి జిపిఎస్ పరికరాలను అమర్చాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 706 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. కర్నూలు డివిజన్లో 150, ఆదోని 163, పత్తికొండ 87, నంద్యాల 155, డోన్ 56, ఆత్మకూరు డివిజన్లో 100 వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. ఈ వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.80 లక్షలు వ్యయం అవుతుందని ప్రాథమికంగా పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. వచ్చే నెల నుంచి ఎండియు వాహనాలకు జిపిఎస్ విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారు. తెల్ల, అంత్యోదయ కార్డులు కలిపి కర్నూలు జిల్లాలో 6,62011, నంద్యాలలో 5,33,429 కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాకు 8,548.30, కర్నూలుకు 11,504 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపులు చేస్తున్నారు. ఎండియూ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత కోటాలో మిగులు క్రమంగా పెరుగుతోంది. గతంలో 88 శాతం వరకు పంపిణీ ఉండేది. ఇది క్రమేనా తగ్గుతూ ప్రస్తుతం 80 శాతానికి పడిపోయింది. అక్టోబరు, నవంబరు నెలల్లో 80 శాతం పంపిణీ జరిగింది. ఎండీయూ, వాహనాలు నెలకు ఒక్కరోజే వీధిలోకి వస్తున్నాయి. ఆ రోజు తీసుకోకపోతే వారి కోటా మిగిలిపోయినట్లే. ఎండీయూ వాహనాలకు జీపీఎస్ పరికరాలు ఆమ ర్చితే వాటి ద్వారా నెలలో ఎన్ని రోజులు.. ఏయే ప్రాంతాల్లో సరకుల పంపిణీ చేస్తున్నారు..? ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసేందుకు అవకాశం లేని ప్రాంతాల వివరాలు తెలపాలని పౌర సరఫరాల అధికారి కార్యాలయాలకు ఉత్తర్వులు వచ్చాయి.



ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

ఆరోగ్యశ్రీ ప్రజలందరికీ వరంలాంటిది

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్

ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ ఒక వరం లాంటిదని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలోని ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఐదు లక్షల ఉన్న ఆరోగ్యశ్రీని ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం 25 లక్షల రూపాయలకు పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ. 25 లక్షల వరకు పరిమితి ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యశ్రీ ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమన్నారు. వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి వస్తుందని, ఎవరు డబ్బులు వృధా చేసుకోకుండా ఆరోగ్యశ్రీ కార్డును ఉపయోగించు కోవాలన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి ఏమైనా సమస్య ఉంటే సచివాలయంలో ఉన్న హెల్త్ డిపార్ట్మెంట్ వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలో పేద క్రైస్తవులకు ప్రముఖ వ్యాపారవేత్త, చక్రం బీడీ అధినేత ముల్లా షబ్బీర్ అహ్మద్ బుధవారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. త్వరలో క్రిస్మస్ పండుగ ఉండడంతో వీరికి దుస్తులను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది క్రిస్మస్ సందర్భంగా పేద క్రైస్తవులకు ఉచితంగా దుస్తులను ఆయన పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ పండగ ఎంతో పవిత్రమైందన్నారు. వారు సంతోషంతో క్రిస్మస్‌ను జరుపుకోవాలని, వారికి ముందస్తు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు దుస్తులు అందజేస్తున్న చక్రం షబ్బీర్ అహ్మద్

జాతీయ త్రోబాల్ పోటీలకు 'గురురాజా' విద్యార్థులు

- క్రీడాకారులను అభినందించిన గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులు జాతీయస్థాయి త్రోబాల పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12 వరకు నంద్యాల కేఎన్ఎం మున్సిపల్ స్కూల్లో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారన్నారు. అండర్-14లో అక్షయ జ్యోతి, మణికంఠలు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు కెఎన్ఎం మున్సిపల్ స్కూల్లో జరిగిన త్రోబాల్ పోటీలలో అండర్-17లో కే.పాండురంగ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 20న పాఠశాల ఆవరణంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న క్రీడాకారులకు గురురాజా విద్యా సంస్థ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. త్రోబాల్ క్రీడలో విజయం సాధించేందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్బారావును అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్ షేక్షావలి రెడ్డి

నైతిక విలువల పెంపుదలకు కృషి అభినందనీయం : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం, వారిలో సామాజిక స్పృహని కల్పించడం కోసం నంది బాలోత్సవాన్ని నంద్యాల పట్టణంలో నిర్వహించడం అభినందనీయమనిమున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి అన్నారు. ఈ నెల 28, 29 తేదీలలో నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్‌లో జరుగుతున్న నంది బాలోత్సవంను పురస్కరించుకొని నంది బాలోత్సవ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నగేష్, గౌరవ సలహాదారు శంకరయ్య, కన్వీనర్ రామరాజు, సభ్యులు డాక్టర్ నాగరాజు, గురుస్వామి తదితరులతో కలిసి మున్సిపల్ కమిషనర్ లోగోను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిల్లలలో ఉన్న స్కిల్‌ను బయటికి తీయడం కోసం, వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక కార్యక్రమాలను బాలోత్సవం పేరుతో నిర్వహిస్తున్నారని, ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు.

నందిబాలోత్సవం లోగోను ఆవిష్కరిస్తున్నకమిషనర్

టిడిపి తప్పుడు జిఒలతో మభ్యపెట్టింది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

గత ప్రభుత్వం సుండిపెంట ప్రజలను తప్పుడు జీవోలతో మభ్యపెట్టి పబ్బం గడుపుకుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సున్నిపెంటలోని రెడ్డి కళ్యాణ మండపంలో ముఖ్యమంత్రి పుట్టిన రోజు, క్రిస్టమస్ సందర్భంగా చర్చి పాస్టర్లకు దస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే సుండిపెంట ముఖచిత్రాన్ని మార్చానని, ఇంకా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాలనీలోని భూమిని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యాసంస్థలకు, శ్రీశైలం ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వగా మిగిలిన స్థలంలో 218 ఎకరాలు గృహ అవసరాల మేరకు సర్వే నడుస్తుందని చెప్పారు. 70 శాతం వరకు సర్వే పూర్తి చేశారని వివరించారు. కాలనీలో నీటి, విద్యుత్ మీటర్లు, పారిశుధ్యం తదితర సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టర్‌తో పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సుండిపెంటకు శాశ్వత పరిష్కారం కోసం చర్చించామని చెప్పారు. కాలనీలో మరో వారం పది రోజుల్లో ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ సమన్వయంతో నీటి సమస్య తీరనున్నదని తెలిపారు. కాలనీకి రూ. 1.60 కోట్లు జల జీవన పథకంలో నిధులకు కలెక్టర్‌ను అడిగామని, 15వ ఫైనాన్స్ ప్రకారం పంచాయితీ ఎన్నికలు జరగలేదనే నెపంతో పంచాయతీకి నిధులు మంజూరు కావడం లేదన్నారు. కాలనీలో అక్రమ నిర్మాణాల పేరుతో గృహ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని, గతంలో పూర్తయిన గృహాలను గుర్తించి ఎన్ఒసి ధ్రువపత్రం సచివాలయం సిబ్బందితో తీసుకుంటే మీటర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం సుండిపెంట ఎన్జీవోస్ సమస్యలపై జేఏసీ నాయకులు దాసరి మల్లికార్జున, మద్దిలేటి, ప్రసాదు, డేవిడ్, బాబు రాజేంద్ర ప్రసాద్‌లు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త భువనేశ్వర్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ తేజ, గుండయ్య యాదవ్, రఫీ, భరత్ రెడ్డి, పాపారావు, పాస్టర్లు దేవసహాయం, స్వామిదాస్, ప్రభుదాసు, మహిళలు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

విజయభాస్కర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, ఏ.రాజశేఖర్ తదితరులు

సిపిఎం సానుభూతిపరుడు మృతి

- నివాళులర్పించిన పార్టీ నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్‌లో నివాసముంటున్న సిపిఎం సానుభూతి పరుడు రాచేటి విజయభాస్కర్ (38) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన సిపిఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు ఆయన స్వగృహానికి వెళ్లి విజయభాస్కర్ మృతదేహానికి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటినుంచి సిపిఎం విధానాల వైపు విజయ భాస్కర్ కుటుంబం ఉందని, ఆత్మకూరు డివిజన్లో సిపిఎం నిర్మాణంలో, ప్రజా సంఘాలను ఏర్పాటు చేయడంలో వారి కుటుంబం మొత్తం సహకరించిందని తెలిపారు. భాస్కర్ తండ్రి రాబర్ట్ సర్వేయర్‌గా ఉద్యోగం చేస్తూ మరోవైపు సిపిఎం ఉద్యమ నిర్మాణానికి సహకరించారని తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్, మండల నాయకులు చందా వారి వెంకటేశ్వర్లు, మాభాష, పి.సుధాకర్, నక్క దినేష్, నాయకులు షైక్ ఇస్మాయిల్, సురేంద్ర, డి.రామ్ నాయక్, వీరన్న తదితరులు ఉన్నారు

యువగళం ముగింపు సభకు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - బేతంచెర్ల : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి బేతంచెర్ల మండలం నుండి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

యువగళం ముగింపు సభకు వెళ్తున్న నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

1వ తేదీన జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-డోన్ : ప్రతి నెలా 1వ తేదీన జీతాలు ఇవ్వాలని, పిఎఫ్, ఏపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, డోన్ మండల అధ్యక్షుడు బివై సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డోన్ పట్టణంలోని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి కార్యాలయంలో వారి వ్యక్తిగత కార్యదర్శికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తామని మాట ఇచ్చి మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎపి సిఎం కూడా సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోపాల్, బాలరంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, షంషాద్ బేగం, సుమన్, కలాం, రాజశేఖర్, అంజనప్ప, చంద్రమోహన్, మురళీకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

26 నుండి దత్తాత్రేయ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని యస్.లింగందిన్నె గ్రామంలో ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు, శ్రీ అవధూత సీతారామ యోగేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలు జరుగుతాయని ఆశ్రమ నిర్వాహకులు ధరణి కాత్యాయనమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని గొడెగనూరు గ్రామ సమీపంలో బుధవారం మోటర్ సైకిల్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని కొత్తపల్లెకు చెందిన పెద్ద ఈశ్వర్ రెడ్డి, పుల్లారెడ్డిలు ద్విచక్ర వాహనంపై కొత్తపల్లె నుండి ముత్యాలపాడుకు వెళుతుండగా అహోబిళం నుండి పోరుమామిళ్లకు వెలుతున్న కారు ఢీకొంది. దీంతో ఈశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డిలు తీవ్రంగా వీరిని చాగలమర్రిలోని కేరళ వైద్యశాలకు తరలించారు. పెద్ద ఈశ్వర రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

వైఎస్ఆర్ బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని ఈద్గా నగర కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ భాస్కర్ కుటుంబానికి తక్షణ సాయం కింద వైఎస్ఆర్ బీమా ద్వారా పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి బుధవారం అందజేశారు. రెండు రోజుల క్రితం నంద్యాల సమీపంలోని నూనెపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ భాస్కర్ మృతి చెందిన విషయం విధితమే. భాస్కర్ కుటుంబాన్ని వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ భాస్కర్ కుటుంబానికి ఎల్లవేళలా తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో 3వ గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, ఈద్గా నగర్ వైసిపి నాయకులు గౌండ కంబగిరి, మాబాషా, బోయపేట గౌండ సుబ్బయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అర్హులైన పేదలందరికీ కులమత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 5వ గ్రామ సచివాలయ పరిధిలోలోని అమ్మవారి శాల ఏరియా, యాదవ కాలనీ, చాకలిపేటలలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో ప్రతి ఇంటికి లబ్ధి జరిగిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడీవో శివరామయ్య, ఎంఈఓ స్వరూప, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, భానుముక్కల పరపతి సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు ఎంపిటీసీలు వెంకటసుబ్బయ్య, అబ్దుల్ తాహిర్, వార్డు మెంబర్లు జీటీ వెంకటరామిరెడ్డి, పెయింటర్ ప్రసాద్, కుమ్మరి సురేష్ బాబు, భానుముక్కల రైతు సంఘం అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, వెంకట రెడ్డి, సయ్యద్ సజ్జాత్ హుస్సేన్, కోనేటి శ్రీనివాసులు, కిషోర్ కుమార్, చిలకన్న గారి శ్రీరాములు, ఖానిక్, బిల్లా నాగరాజు యాదవ్, మనోహర్ యాదవ్, కృష్ణమూర్తి చాకలి ప్రసాద్, చాకలి వెంకటరమణ, గౌండ కంబగిరి, గౌండ సుబ్బయ్య, బాలు నారాయణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు : కౌన్సిలర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణం 36వ వార్డులో లబ్ధిదారులకు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను కౌన్సిలర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ సురక్షితమైన వైద్యాన్ని అందించేందుకు సరికొత్తగా రూ. 25 లక్షల వరకు వివిధ వైద్య సేవలను అందించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ముఖ్యమంత్రి తీసుకొచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, వార్డు ఇన్చార్జి పూర్ణిమ, వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తున్న కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి

టిడిపి పాలనలోనే పేదల సంక్షేమం : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి పాలనలోనే పేద ప్రజల సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రంగరాజుపేటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను బిసి ఇందిరా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, టిడిపి పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య, పట్టణ అధ్యక్షుడు ఖాసింబాబు, నాయకులు లాయర్ నాగేంద్రరెడ్డి, ఖాదర్, బచ్చు భాస్కర్, ఇస్మాయిల్ ఖాన్, బొబ్బల మహేశ్వర రెడ్డి, అహ్మద్ హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేస్తున్న బీసీ ఇందిరా

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారి

ప్రజాశక్తి వెలుగోడు : మండల పరిధిలోని వెలుగోడు, అబ్దుల్లాపురం, వేల్పనూరు, రేగడ గూడూరు, గుంతకందాల గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ, డిఎస్పి శ్రీనివాసరావు, సిఐనాగభూషణం, తాసిల్దార్ నారాయణ రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా ఉన్న వేల్పనూరు, అబ్దుల్లాపురం గ్రామాలతో పాటు రేగడ గూడూరు గ్రామాన్ని కూడా సమస్యాత్మక పోలీస్ కేంద్రాల జాబితాలో చేర్చినట్లు వారు తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి సమస్యలు, అంతరాయాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై నేడు పోలింగ్ స్టేషన్ కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. వీరి వెంట ఎస్సై వెంకటప్రసాద్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

26 నుండి ఫిబ్రవరి 10 వరకు 'ఆడుదాం-ఆంధ్ర'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు నిర్వహించే ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా కీడాప్రాధికార అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసుకొని విజయ వంతంగా క్రీడల పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే క్రీడా సామాగ్రి అన్ని మండలాలలోని సచివాలయాలకు చేరవేశామన్నారు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఆటస్థల మైదానాలను పరిశీలించి గుంతలు లేకుండా చదును చేసుకోవడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మారుతున్న జీవన శైలిలోని ఒత్తిడిలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్ర క్రీడల ద్వారా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **రుద్రవరం :** ఆడుదాం-ఆంధ్ర క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు, పిఈటిలకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం-ఆంధ్ర క్రీడల నిర్వహణ తీసుకోవలసిన అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, పిఈటిలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ లక్ష్మి, ఈఓఆర్డి శ్రీనివాస వర్మ, ఏవో వరలక్ష్మి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆదర్శ పాఠశాల కస్తూర్బా పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ పిఈటీలు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** రెట్టింపు ఉత్సాహంతో క్రీడా పోటీలను విజయవంతం చేయడానికి ముందుకు రావాలని బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల నగర పంచాయతీలో చైర్మన్ చలం రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబులు మండలంలోని యువతీ యువకులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

మాట్లాడుతున్న యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి

ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

- వైసిపి యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి

ప్రజాశక్తి - గడివేముల : పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు, యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం గడివేములలోని వైసిపి కార్యాలయంలో కొర్రపోలూరు, దుర్వేసి, తిరుపాడు గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల్లో చిన్నచిన్న మనస్పర్థలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి కార్యకర్త సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. పాణ్యం టికెట్ ఎవరు ఆశించినా అంతిమంగా కాటసాని రాంభూపాల్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ శివరాం రెడ్డి, గని ఆనంద రెడ్డి, పెసరవాయ్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సెక్రటరీ రఘు మాధవరెడ్డి, కొర్రపోలురు సుబ్బారెడ్డి, సర్పంచ్ మాలిక్ భాషా, దుర్వేసి బండపల్లి రమేష్, కృష్ణారెడ్డి, శంకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదుకోండి ఎమ్మెల్యే సారూ..

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

'మా బతుకులు వీధిన పడ్డాయి.. మాకు సహాయం చేసి ఆదుకోండి ఎమ్మెల్యే సారూ..' అని దుకాణాలను కోల్పోయిన మహిళలు బుధవారం రెడ్డి కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి మొరపెట్టుకున్నారు. బాధిత మహిళలు మాట్లాడుతూ శ్రీశైలం రహదారిలో ఉన్న హఠకేశ్వరం, సాక్షి గణపతికి ఇరువైపులా రోడ్డు మార్గంలో భక్తులకు అటవీ ఫలాలను అమ్ముకొని జీవించేవారమని, అటవీశాఖ వారు దుకాణాలను ఎత్తివేయడంతో ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత ఆటవీ శాఖ వారితో చరవాణిలో మాట్లాడి పేదలు అమ్ముకుంటున్న దుకాణాలను అక్కడే ఉంచాలన్నారు. సమస్యను పరిష్కరించడంతో మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: NANDYAL
O.S.N0. 766 / 2019
M/s Kubera Estate Traders, a Regd. firm Rep by its partner Neravati Satya Narayann, Nandyal. ...PLAINTIFF
V/s
1) Madannagari Rama Krishna, aged about 38 years, Son of Narayana, Hindu, agriculturist, R/o Sirvella Village and Mandal. Nandyal District.
2) Kunchepu Pedda Venkateswarlu,
3)K.Venkata Subba Reddy, agcd about years, son of K.Chinna Rami Reddy, Hindu, resident of H.No. 25-450- 2B-101, YSR Nagar, Nandyal. ...DEFENDANTS
1 మరియు 3 ప్రతివాదులకు దావా సమన్లు
పై దావా నందు ప్రతివాదులైన మీ పైన వాది పర్మినెంట్ ఇంజక్షన్ కోరి దావా దాఖలు చేయగా కోర్టు వారు 1 మరియు 3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ.5-1-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 05-1-2024
ఇట్లు
గోర్ల జయకృష్ణ,
వాది తరపు అడ్వకేట్, నంద్యాల.
సెల్ : 9849592424.

Notice under order 39 rule 1of c.p.c. ప్రకారం
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: NANDYAL
I.A. NO.1421/2019 0.S.N0. 766 / 2019
M/s Kubera Estate Traders, a Regd. firm Rep by its partner Neravati Satya Narayann, Nandyal. ...PETITIONER / PLAINTIFF
V/s
1) Madannagari Rama Krishna, aged about 38 years, Son of Narayana, Hindu, agriculturist, R/o Sirvella Village and Mandal. Nandyal District.
2) Kunchepu Pedda Venkateswarlu,
3) K.Venkata Subba Reddy, agcd about years, son of K.Chinna Rami Reddy, Hindu, resident of H.No. 25-450-2B-101, YSR Nagar, Nandyal. ...RESPONDENTS /DEFENDANTS
1 మరియు 3 రెస్పాండంట్స్ కు నోటీసులు
పై అర్జీ నందు రెస్పాండంట్స్ అయిన మీ పైన అర్జీదారు పర్మినెంట్ ఇంజక్షన్ కోరి అర్జీ దాఖలు చేయగా, కోర్టు వారు 1 మరియు 3 రెస్పాండంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ.5-1-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 5-1-2024
ఇట్లు
గోర్ల జయకృష్ణ,
వాది తరపు అడ్వకేట్, నంద్యాల.
సెల్ : 9849592424.

జోలె పట్టి.. భిక్షాటన చేస్తూ..

ప్రజాశక్తి - విలేకరులు

మిడుతూరు : అంగన్‌వాడీల సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిష్కరించక పోగా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం విమర్శించారు. మిడ్తూర్ మండల కేంద్రంలో అంగన్వాడీలు వ్యకాసం జిల్లా నాయకులు టి.ఓబులేష్ అధ్యక్షతన నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమానికి టిడిపి, సిఐటియు, వ్యకాసం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఖాతా రమేష్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోగా నిరసనలు చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం జగన్ అధికారమదానికి నిదర్శనమన్నారు. జగన్ ప్రతిపక్షంలో పాదయాత్ర సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. జీతం పెంచకపోగా ఆదాయ పరిమితి అస్త్రంతో అంగన్వాడీల సంక్షేమ పథకాల్లో కోత పెట్టారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. సమ్మెకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. తక్షణమే అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు వంగల శివరాం రెడ్డి, వెంకట్రామిరెడ్డి, పి.సుభాన్, వ్యకాసం జిల్లా నాయకులు పక్కిరి సాహెబ్, సంపంగి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు కెవి.మదిలేటి, జి.లింగస్వామి, వెంకట శివుడు, రైతు సంఘం నాయకులు సుజ్ఞానం, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సుబ్బమ్మ, జి.లక్ష్మికుమారి, ఉమాదేవి, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు. **పగిడ్యాల :** సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి అంగన్వాడీలకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు పగిడ్యాల తహశీల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు బిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలు సాజిదాబి, రాములమ్మ, పద్మావతి, ప్రభావతమ్మ, వరలక్ష్మి, హైమావతి, నారాయణమ్మ, స్వర్ణలత, నాగమణి పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని పటేల్ సెంటర్, మున్సిపల్ కార్యాలయం, కేజీ రోడ్డుపై అంగన్వాడీలు బిక్షాటన చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావులు మాట్లాడారు. 9 రోజులుగా సమ్మె చేస్తున్నా చెవిటి వారి ముందు శంఖం ఊదినట్లు ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమ్మెకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ అశోక్‌రత్నం, జనసేన పార్టీ నాయకులు రవికుమార్, వెంకటేష్, మధు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, నాయకులు నాగన్న, వ్యకాసం నాయకులు పకీర్ సాహెబ్, నాయుడు, సుంకన్న, అంగన్వాడి నాయకులు మదార్‌బి, శైలజ, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, హరిత, ఉమాదేవి, వెంకటలక్ష్మి, కీర్తి పాల్గొన్నారు. అలాగే జూపాడు బంగ్లా మండల కేంద్రంలో బస్టాండు నుంచి రోడ్డుకు ఇరువైపులా భిక్షాటన చేస్తూ కేజీ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సిసిలకు, ఎపిఒ గౌరీ భాయ్‌కి వినతి పత్రం సమర్పించారు. వ్యకాసం జిల్లా నాయకులు ఎం.కర్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మావతి, వెంకట రమణమ్మ, ప్రసన్న, ఆయాలు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలో అంగన్వాడీలు చిప్ప చేత పట్టుకొని బిక్షాటన చేసి నిరసన తెలిపారు. అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు హరిత, నాయకులు నాగమణి, శ్రీదేవి, అంగన్వాడీలు రమణమ్మ, వసంత, మరియమ్మ, అచ్చమ్మ, ప్రభావతమ్మ, శిరీష, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల బిక్షాటన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్, గౌడ్ సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్ వరకు అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్లి అంగనవాడి కేంద్రాల తాళాలు పగలగొట్టిన వారిపై కేసు నమోదు చేయాలని ఎస్సై హుస్సేన్ భాషకు వినతి పత్రం అందజేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, రైతు సంఘం అధ్యక్షులు మా బాషా, అంగన్‌వాడీ నాయకురాళ్లు వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, రమణమ్మ, ప్రియాంక, చెన్నమ్మ, ఆదిలక్ష్మి, ప్రశాంతి, కవితా బాయి, నాగమ్మ, వాణి, వసంతకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీల సమ్మెకు ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాం బాలాజీ నాయక్, నాయకులు నాగస్వామి నాయక్, రమేష్ నాయక్, రాజేష్ నాయక్, దరగానాయక్, కృష్ణనాయక్ సంపూర్ణ మద్దతు తెలిపి పాల్గొన్నారు. **చాగలమర్రి :** అంగన్వాడీలు సిఐటియు నాయకురాలు నాగమణి, సంజమ్మ, పద్మావతి, వసంత, వై పద్మావతి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రకళ, ఇందుమతి వహీదాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వంట వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. గుర్రమ్మ, రామ సుబ్బమ్మ హసానమ్మ, సిఐటియు నాయకులు పద్మావతి, వసంత పాల్గొన్నారు. చాగలమర్రిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు డ్యానీ జాన్సన్, జిల్లా కౌన్సెలర్లు మహమ్మద్ గౌస్, శంకర్ తదితరులు మద్దతు ప్రకటించారు. **కొలిమిగుండ్ల :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు వెంట అంగన్‌వాడీలు భిక్షాటన చేపట్టారు. అంగన్వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు వెంకట లక్ష్మమ్మ, లలితమ్మ, నిర్మల, జిల్లా నాయకులు దావీదు, అంగన్వాడి నాయకులు పద్మావతి, శ్రీదేవి, ప్రభావతి, భాగ్యలక్ష్మి, త్రివేణి, మహాలక్ష్మి, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడులో అంగన్వాడీలు బిక్షాటన చేపట్టారు. యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రవణ భాయ్, శ్రీలత, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యం ఎంపీడీవో ఆఫీస్ ముందు అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు. ఆ తర్వాత అక్కడి నుండి పాణ్యం బస్టాండ్ సెంటర్ వరకు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు వెంకటమ్మ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకటేష్, మండల కార్యదర్శి కె.భాస్కర్, విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్, వెంకటమ్మ, స్వరూప, మరియమ్మ, ప్రభాతమ్మ, లలితమ్మ, అనసూయ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో బిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపినారు. అంగన్వాడీలకు బిజెపి తాలూకా ఇంచార్జ్ కిషోర్ రెడ్డి మద్దతు తెలిపారు. సిఐటియు కార్యదర్శి రమేష్ బాబు, అంగన్వాడి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, పెద్దక్క, నరసమ్మ, హుస్సేనమ్మ, విజయ, ధనలక్ష్మి, శుభలేఖ పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** బండి ఆత్మకూరులో అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు భిక్షాటన చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, నాయకులు రాజు, అంగన్వాడి నాయకులు వెంకటరమణమ్మ, వసంత, శ్యామల, ఆనందమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. **వెలుగోడు :** వెలుగోడులో అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో బిక్షాటన కార్యక్రమం చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి.నాగమోహన్, అంగన్వాడి సెక్టార్ నాయకురాలు కుమారి, సుమిత్రమ్మ, భాగ్యలక్ష్మి, రవణమ్మ, అంగన్‌వాడీలు జయమ్మ, మల్లేశ్వరి, మల్లమ్మ, సువర్ణ, సరస్వతి, మేరమ్మ, శివమ్మ, పార్వతి, సునీత, సుకన్య, మహాలక్ష్మి, తులసమ్మ పాల్గొన్నారు. **గడివేముల :** గడివేములలోని పాత బస్టాండ్ కూడలిలో దుకాణాల వద్ద అంగన్వాడిలు ర్యాలీగా వెళ్లి బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, సహాయ కార్యదర్శి బాలవెంకట్, భాస్కర్‌లు మాట్లాడారు. అంగన్వాడి మండల నాయకురాలు వసంత లక్ష్మి, రామ్ చెన్నమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్తూ బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, డివిజన్ కార్యదర్శి జెవి.సుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, శశికళ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు బిక్షాటన చేపట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ ప్రాజెక్టు కార్యదర్శి సునీత, జిల్లా నాయకురాళ్లు నాగరాణి, ప్రాజెక్ట్ నాయకురాళ్లు ప్రసన్న మాట్లాడారు. అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాబోయే కాలంలో ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సారమ్మ, మదార్ బీ, కాశమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మెడలో ఉరి తాళ్లు బిగించుకొని నిరసన

రుద్రవరం : రుద్రవరంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ నాయకురాలు మనోజ, పద్మావతి, బిబి, రాణి తదితరులు మెడలో ఉరి తాళ్ళు బిగించుకొని నిరసన తెలిపారు. సమ్మె పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల తమ కుటుంబాలన్నీ బజారుపాలయ్యాయని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు టి.రామచంద్రుడు స్థానిక తహశీల్దార్ రవీంద్రప్రసాద్ అంగన్వాడీల వద్దకు పిలుచుకు వచ్చారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో అంగన్‌వాడీలు ఉరితాళ్ల నిరసనను విరమించారు.

నంద్యాల పట్టణంలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

మిడుతూరులో అంగన్‌వాడీలకు మద్దతు తెలియజేసి మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నందికొట్కూరులో బిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

ఆత్మకూర్ పట్టణంలో అంగన్వాడీలకు భిక్షం వేస్తున్న సెల్ పాయింట్ యజమాని రవి ప్రసాద్

గడివేములలో బిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు

ఆళ్లగడ్డలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

పగిడ్యాలలో భిక్షాటన చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు

బనగానపల్లెలో అంగవాడీలకు మద్దతు తెలుపుతున్న బిసి ఇందిరా

పాములపాడులో బిక్షాటన చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు

పాణ్యంలో నిరసన తెలియజేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

వెలుగోడులో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు